క్లుప్తంగా

కోటదుర్గమ్మ సేవలో ఎస్పీ



ఎస్పీ మాధవరెడ్డికి దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న దేవదాయశాఖ అధికారులు, అర్చకులు

పాలకొండ రూరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎస్పీ మాధవరెడ్డి పాలకొండ కోట దుర్గమ్మను గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ అధికారులు ఆలయ మర్యాదలతో ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ విశిష్టత, పోలీసుల ఇలవేల్పుగా కొనసాగుతున్న అమ్మవారి ప్రాముఖ్యతను అర్చకులు లక్ష్మీప్రసాద్‌శర్మ, మనీల్‌కుమార్ శర్మ వివరించారు. అనంతరం వేదమంత్రాల నడుమ ఆశీర్వచనాలతో పాటు అమ్మవారి చిత్రపటం, జ్ఞాపికను ఈఓ సూర్యనారాయణ అందించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ ఎ.ప్రసాద్, ఎస్సై ప్రయోగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ



రైతులకు యూరియా అందజేస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ డొల్లు కిశోర్ గురువారం స్థానిక రైతులకు గురువారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులందరికీ యూరియా అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఏఓ పి.నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈఓ, స్థానిక నాయకుడు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపులో చోరీ

భామిని: మండల కేంద్రంలోని ఓ వైన్‌షాప్‌లో చోరీ జరిగింది. ఈ మేరకు నిర్వాహకులు గురువారం ఉదయం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి దొంగలు షాపు తాళాలు పగులగొట్టి ఏడు వేల రూపాయలన నగదు, మద్యం బాటిళ్లు దోచుకెళ్లిపోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు 20 వినతులు



వండువ సచివాలయంలో వినతులు స్వీకరిస్తున్న సిబ్బంది

వీరఘట్టం: మండల వ్యాప్తంగా 24 సచివాలయాల్లో గురువారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు 20 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై విచారణ చేపట్టి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



లఖనాపురంలో అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీస్తున్న సభ్యులు

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నీతిఆయోగ్ కమిటీ సభ్యులు ఎస్.అప్పలనాయుడు, కె. మురళి హెచ్చరించారు. మండలంలోని లఖనాపురం, నందివానివలస, పెద్దూరు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. పౌష్టికాహారం నిర్వహణపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. పరిశీలనలో కొమరాడ సీడీపీఓ జి. సుగుణకుమారి, రావివలస, పెదగుడబ, ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు ఆర్. లక్ష్మి, పి బంగారమ్మ, తదితరులున్నారు.

భూ సమస్యలపై ఆరా..



భూ సమస్యలను అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

- తురకనాయుడువలసలో గ్రామసభ
- సమస్యలు అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

జియ్యమ్మవలస రూరల్:

మండలంలోని తురకనాయుడువలస గ్రామానికి చెందిన సుమారు 650 ఎకరాల భూములకు సంబంధించి పలు సమస్యలు నెలకొనడంతో అధికారులు గురువారం గ్రామసభ నిర్వహించారు. జిరాయితీ భూములను రికార్డుల్లో బంజరు భూములుగా చూపించడం.. జాయింట్ ఎల్పీఎంలు విడదీయకపోవడం.. ఆన్‌లైన్‌లో వన్‌బీలు రాకపోవడం.. భూమి ఉన్నా చూపించకపోవడం.. వంటి సమస్యలతో రైతులు కొన్నాళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొద్దిరోజులుగా స్థానిక రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ విషయం పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ దృష్టికి వెళ్లడంతో గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వై. జయలక్ష్మి ఆధ్వర్యంలో ఎనిమిది మంది వీఆర్‌ఓలు, మండల, సచివాలయ సర్వేయర్లతో కలిపి సబ్ కలెక్టర్ విచారణ చేపట్టారు. రైతులంతా తమ సమస్యలను సబ్ కలెక్టర్‌కు విన్నవించారు. జాయింట్ ఎల్పీఎంలు విడదీయనందున సుమారు 400 ఎకరాల జిరాయితీ భూమి ఆన్‌లైన్‌లో బంజరు భూమిగా చూపిస్తోందని రైతులు తెలిపారు. దీంతో సబ్‌కలెక్టర్ స్పందిస్తూ సమస్యలు నెలకొనడంలో రెవెన్యూ అధికారుల పొరపాట్లు కూడా ఉన్నాయని, వాటిని సవరించి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వీఆర్‌ఓ, సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలి



గతంలో పనిచేసినవీఆర్‌ఓ రాధమ్మ, సర్వేయర్ చిట్టమ్మ మా గ్రామంలోని రైతులకు తీవ్ర అన్యాయం చేశారు. ఒకరు డబ్బులు ఇవ్వందే ఏ పనీ చేయరు. ఇంకొకరు ఈ గ్రామంలోని బంజరు భూమిని తన తల్లిపేరిట నమోదు చేయించుకున్నారు. వీఆర్‌ఓ కొంతమందికి తనకు నచ్చినట్లు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా ఇచ్చేశారు. ప్రస్తుతం వీరిద్దరూ బదిలీపై వెళ్లడం చాలా మేలు జరిగింది. – భీమవరపు సింహాచలం, రైతు

భూమి లేదంటున్నారు..



నాకు మూడు ఎకరాల జిరాయితీ భూమి ఉంది. అయితే ఆన్‌లైన్‌లో సెంటు భూమి కూడా లేదని చూపిస్తోంది. నా పట్టాదారు పాస్ పుస్తకంలో ఎల్పీఎం కింద 30 మంది రైతులు ఉన్నట్లు చూపిస్తున్నారు. రుణం కోసం బ్యాంక్‌కు వెళితే సిబ్బంది కుదరదని చెబుతున్నారు. ఈ విషయాన్ని వీఆర్‌ఓకు పలు మార్లు చెప్పినా ఫలితం లేకపోయింది. – రంభ సూర్యనారాయణ, రైతు

చెత్త వేయడం సరికాదు

- వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు



చెరువులో చెత్తవేయటం సరికాదని అడ్డుపడుతున్న వైస్ ఎంపీపీ, తదితరులు

పాలకొండ రూరల్: ప్రజల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అధికారులే.. ఇలా జనావాసాల మధ్య, నీటి వనరుల్లో చెత్త వేయడం సరికాదని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. మండల పరిధి ఓని గ్రామ రహదారిలో గల బత్తులవాని చెరువులో చెత్త డంపింగ్ చేయడానికి వచ్చిన వాహనాలను గ్రామస్తులతో కలిసి గురువారం అడ్డుకున్నారు. దీంతో అక్కడకు చేరుకున్న కమిషనర్ రత్నరాజుకు చెత్త వేయడం వల్ల కలిగే ఇబ్బందులను వైస్ ఎంపీపీ, తదితరులు వివరించారు. తనకు కొద్ది రోజుల సమయం ఇస్తే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని కమిషనర్ చెప్పడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల సర్పంచ్‌ల సంఘ ఉపాధ్యక్షుడు టి.ఉపేంద్రకుమార్, కరణం భాస్కరరావు, నల్లి నాగభూషణరావు, తదితరులు వెనుదిరిగారు.

వీడని ఏనుగుల భయం



సన్నాయిగూడ సమీపంలోని జీడితోటలో ఏనుగులు

భామిని: మండల రైతులకు ఏనుగుల కష్టాలు వీడడం లేదు. రెండు రోజుల కిందటి వరకు తివ్వాకొండ మీదున్న నాలుగు ఏనుగుల గుంపు గురువారం నాటికి సన్నాయిగూడ పరిసరాల్లోని జీడితోటల్లో తిష్టవేశాయి. దీంతో ఎప్పుడు ఎటువంటి ఉపద్రవం చోటుచేసుకుంటుందోనని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కోసం తప్పని పాట్లు..



భామిని మండలం కోసలి సచివాలయం వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న కోసలి, కీసర గ్రామాల రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. బస్తా యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. మహిళా రైతులు సైతం క్యూలో నిల్చొన్నారు. – భామిని

పంచాయతీ పురోగతిపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్

కొమరాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శెట్టి శ్యామల అధ్యక్షతన పంచాయతీ పురోగతి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఎస్. రమేష్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2025 – 26 సంవత్సరానికి గాను తొమ్మిది సిద్ధాంతాలతో శిక్షణ ఇచ్చామన్నారు. పేదరికం లేని మెరుగైన జీవన ఉపాధి కల్పించడం, ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీ, నీటి సమృద్ధి, పచ్చదనం – పరిశుభ్రత, సుపరి పరిపాలన, మహిళా స్నేహపూర్వక పంచాయతీ, స్వయం సమృద్ధి, తదితర అంశాలపై ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు అవగాహన కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో ఫిర్యాదుల స్వీకరణ



రజకవీధిలో చేతి బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పాలకొండ రూరల్: కలెక్టర్ ఆదేశాలతో ఇకపై ప్రతి గురువారం గ్రామ సచివాలయాల వద్ద ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం చేపట్టనున్నట్లు లుంబూరు సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల విభాగం అధ్యక్షుడు తిర్లంగి ఉపేంద్రకుమార్ అన్నారు. ఈ మేరకు తమ పంచాయతీ పరిధిలో గురువారం వినతులు స్వీకరించారు. రజకవీధిలో బోరు బాగా చేయాలని స్థానికులు కోరగా.. వెంటవెంటనే బోరుకు మరమ్మతులు చేయించారు.

వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో రక్తదానం చేస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్ కుమార్‌దేవ్

కురుపాం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో గురువారం నిర్వహించిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. 332 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు సూపరింటెండెంట్ సందీప్‌కుమార్ తెలిపారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌కుమార్ దేవ్ కూడా రక్తదానం చేశారని సూపరింటెండెంట్ తెలిపారు.

పీహెచ్‌సీకి వెళ్లే దారిలో మురుగు

పాచిపెంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారిలో మురుగునీరు పేరుకుపోయింది. మురుగునీటిలో నుంచే రోగులు ఆస్పత్రికి వెళ్తున్నారు. నూతనంగా నిర్మాణం చేపట్టిన బైపాస్ రోడ్డు ఆస్పత్రికి వెళ్లే రోడ్డు కంటే ఎత్తుగా మురుగు ఉండడం, కాలువలు కూడా లేకపోవడంతో వర్షపు నీరు అంతా రోడ్డుపైనే పేరుకుపోతోంది. పుట్టెడు కష్టంతో నిత్యం ఆస్పత్రికి వచ్చే వందలాదిమంది రోగులు, మురుగు నీటిలో నుంచి ఆస్పత్రికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి సమస్య తీసుకువెళ్లినా పరిష్కార మార్గం చూపడం లేదని సమీప ఇళ్ల ప్రజలు, ఆస్పత్రికి వచ్చే రోగులు వాపోతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎనిమిది గంటల పని హక్కుకు ప్రభుత్వం తూట్లు

- కార్మికుల నిరసన

పార్వతీపురం టౌన్: కార్మికుల ఎనిమిది గంటల పని హక్కుకు కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచిందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి.సంగం మండిపడ్డారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చికాగో కార్మిక వీరుల బలిదానాలతో సాధించిన ఎనిమిది గంటల పని హక్కు అమ్మేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. దుకాణాలు, ఫ్యాక్టరీల చట్టాలను సవరించే బిల్లును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వేళల్లో మహిళలతో పని చేయించే నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐసీటీయూ కార్యదర్శి అజ్జపు దామోదర్‌రావు, భవన నిర్మాణ కార్మికుడు ప్రసాద్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కురుపాం: వారపు సంతల్లో నిర్వహించే వైద్య శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీకటి శంకరరావు సూచించారు. మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి, వైద్యారోగ్య శాఖాధికారి భాస్కరరావు ఆదేశాల మేరకు కురుపాం వారపు సంత వద్ద గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేయగా.. అధిక సంఖ్యలో గిరిజనులు వైద్యసేవలు పొందారు. వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ పహారా నడుమ దసరా ఉత్సవాలు

- 150 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు



ఆలయ సమీపంలో విధి నిర్వహణలో పోలీసులు

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలు ఈ ప్రాంతంలో అత్యంత వైభవంగా జరపడం ఆనవాయితీ. సుమారుగా 11 రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలతో పట్టణం జనసంద్రంగా మారుతుంది. ప్రతి రోజు వేలాదిగా తరలివస్తున్న భక్తులు..వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు 150 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పట్టణానికి వచ్చే నాలుగు రోడ్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతించడం లేదు. వీరఘట్టం రోడ్డు, శ్రీకాకుళం రోడ్డు, రాజాం రోడ్డు కూడలిలో పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారు. పాలకొండ డీఎస్పీ, సీఐలతో పాటు నలుగురు ఎస్సైలు, 140 మంది సివిల్, ప్రత్యేక, మహిళా పోలీసులు షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తున్నారు.

వసతిగృహాల సిబ్బందిని కొనసాగించాలి



గుమ్మలక్ష్మీపురం వైటీసీలో సిబ్బందితో కలిసి మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న నాయకులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీల్లోని గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతిగృహాల్లో ఏఎన్‌ఎం, స్వీపర్, డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని యథావిధిగా కొనసాగించాలని ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రైట్స్ ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు లోబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణ, గిరిజన విద్యార్థి సంఘ నాయకుడు పల్లా సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి స్థానిక వైటీసీ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారు మాట్లాడుతూ.. వసతి గృహాలు ఏర్పాటు చేసినప్పటి నుంచి విధులు నిర్వహిస్తున్న వారిని తొలగించడం సరికాదన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకున్నా.. విధులు నిర్వహిస్తున్న వారి సేవాభావాన్ని గుర్తించకుండా. బడ్జెట్ లేదన్న నెపంతో తొలగించేందుకు యత్నించడం అధికారులకు తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

పంటల నమూనాలతో ఆహార భద్రత



తోటపల్లిలో ఆహర పంటల నమూనాపై వివరిస్తున్న ఆర్‌వైఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్

గరుగుబిల్లి: వివిధ రకాల పంటల నమూనాలతో కుటుంబ ఆహార భద్రతను సాధించడం జరుగుతుందని రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్) కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని తోటపల్లి జట్టు కార్యాలయ ప్రాంగణంలోని ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం యజమానులకు గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కషాయాలు, ద్రావణాల తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో శిక్షకులు సత్యనారాయణ, కిరణ్, మాస్టర్ ట్రైనీ బి.శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది



పాలకొండ రూరల్: ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపడుతున్న అధికారులు, సిబ్బంది

కురుపాం: పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరి అన్నారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై కూడా ప్రతిఒక్కరూ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రమేష్, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలి..

గరుగుబిల్లి: ప్రతిఒక్కరూ పరిశుభ్రతను తమ జీవన విధానంగా మార్చుకోవాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని పెద్దూరులో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ఎం.రాజేంద్ర, డిప్యూటీ ఎంపీడీఓ ఎల్. గోపాలరావు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు, వీఆర్‌ఓ కరుణాకర్, కార్యదర్శి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి, తదితరులు

పరిశుభ్రతతో ఆరోగ్యం..

పాలకొండ రూరల్: పరిసరాల పరిశుభ్రతతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని ఇన్‌చార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.మురళీధర్ అన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కార్యాలయ ప్రాంగణంలో సహ సిబ్బందితో కలసి అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

● ఆకాశంలో హరివిల్లు..



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం ఉదయం నుంచి వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలులు వీచాయి. ఈ క్రమంలో వర్షం కురుస్తుందని అంతా అశించారు. ఓ వైపు చిరుజల్లు మరోవైపు భానుడు అస్తమించేందుకు ఉపక్రమిస్తున్న తరుణంలో ఆకాశంలో ఇంద్రధనస్సు సందడి చేసింది. వర్ణశోభితమైన దృశ్యాన్ని స్థానికులు తమ సెల్‌ఫోన్లలో బంధించారు. – పాలకొండ రూరల్



పాలకొండ: కాత్యాయిని దేవి అలంకరణలో కోటదుర్గమ్మ



పాలకొండ రూరల్: నక్కలపేటలో అమ్మవారికి నక్షత్ర హారతి



కురుపాం: అన్నపూర్ణాదేవి అవతారంలో కురుపాం కోటదుర్గ



వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

లోకమాతా పాహిమాం..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మకు భక్తులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. దుర్గామాత వివిధ రూపాల్లో దర్శనమివ్వగా భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేపట్టారు. అమ్మవారిని కాత్యాయిని, అన్నపూర్ణాదేవి రూపాల్లో అలంకరించారు. పలుచోట్ల మహిళా భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్